## పంది గుండె అమర్చిన రోగి మృతి

న్యూయార్క్, నవంబర్ 1: గుండె ఫెయిల్యూర్‌కు చికిత్సగా జన్యుపరంగా మార్పిడి చేసిన పంది గుండెను అమర్చిన రోగి దురదృష్టవశాత్తు మరణించాడు. 58 ఏండ్ల అమెరికన్ లారెన్స్ ఫాసెట్టి గుండె ఫెయిల్ అవ్వటంతో సెప్టెంబర్ 20న యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ వైద్యులు ఆయనకు గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేశారు. మొదటి నెల రోజులు ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నా, ఆ తర్వాత 'ఆర్గాన్ రిజెక్షన్'కు గురైందని, 6 వారాల తర్వాత ఆయన మృతి చెందాడని మేరీల్యాండ్ వైద్యులు బుధవారం ప్రకటించారు. పంది గుండెను అమర్చిన తర్వాత ఫాసెట్టి వేగంగా కోలుకున్నారు. ప్రపంచంలో ఈ తరహా గుండె మార్పిడి ఆపరేషన్ చేసుకున్న రెండో వ్యక్తిగా ఆయన వార్తల్లో నిలిచారు.

## స్వలింగ వివాహాల తీర్పుపై సుప్రీంలో రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ, నవంబర్ 1: స్వలింగ జంటల వివాహాలకు చట్టపరమైన గుర్తింపును తిరస్కరిస్తూ సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలంటూ రివ్యూ పిటిషన్ దాఖలైంది. స్వలింగ జంటల వివాహ కేసు పిటిషనర్ అయిన ఉదిత్ సూద్ సుప్రీంలో ఈ పిటిషన్ దాఖలు చేశారు. స్వలింగ జంటల వివాహ చట్టబద్ధతపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు స్వీయ విరుద్ధమే కాక, అన్యాయంగా ఉందని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. స్వలింగ వ్యక్తులపై సమాజంలో చూపుతున్న వివక్షను అంగీకరించిన సుప్రీం కోర్టు వివక్షకు గల కారణాలను మాత్రం తొలగించలేదన్నారు. స్వలింగ జంటలకు సమాన హక్కులు తిరస్కరించడం ద్వారా వారిని మానవుల కన్నా తక్కువగా చూశారని అన్నారు. దీనిని సమాజంలోని ఒక వర్గం సమస్యగా కాకుండా వ్యక్తుల సమస్యగా ప్రతివాదులు భావించారని, ప్రభుత్వం కూడా ఇదే వైఖరితో ఉందని అన్నారు. స్వలింగ జంటల వివాహానికి చట్టబద్ధమైన గుర్తింపును నిరాకరిస్తూ ఈ ఏడాది సెప్టెంబర్ 17న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీనికి సంబంధించి ఏదైనా చట్టాలు చేసే హక్కు పార్లమెంట్‌కు మాత్రమే ఉందని ఐదుగురు జడ్జీల ధర్మాసనం పేర్కొంది.

# నామినేషన్ వేళ.. తస్మాత్ జాగ్రత్త!

## అభ్యర్థులకు ఎన్నికల సంఘం కీలక సూచనలు

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో.. పోటీ చేసే అభ్యర్థులకు ఎలక్షన్ కమిషన్ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఎమ్మెల్యేగా గెలుపొందిన కొందరిపై వారి ప్రత్యర్థులు నియమావళిని పాటించలేదని ఆరోపిస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నియమావళిని విడుదల చేసింది. అభ్యర్థులు నామినేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అందులో పొందుపరిచింది.

> ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతిపాదించే వ్యక్తులు లేకపోతే వారి నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అలాగే ప్రతిపాదించే వ్యక్తులకు అభ్యర్థి పోటీ చేస్తున్న నియోజకవర్గంలో ఓటు హక్కు లేకపోయినా వారి ప్రతిపాదన చెల్లదు.

**అభ్యర్థి.. ఈ నిబంధనలు తప్పనిసరి...**

- నామినేషన్ వేసే అభ్యర్థి గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీకి చెందిన వారైతే సదరు అభ్యర్థిని అదే నియోజకవర్గానికి చెందిన ఒక ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. గుర్తింపు పొందని పార్టీ నుంచి లేదా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే పక్షంలో అదే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- ఓటు హక్కు ఉన్న నియోజకవర్గం నుంచి కాకుండా మరో స్థానం నుంచి పోటీ చేయాలనుకుంటే తనకు ఓటు హక్కు ఉన్నట్టు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి.
- ఒక్కో అభ్యర్థి ఒక్కో నియోజకవర్గం నుంచి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయొచ్చు.
- ఎన్నికలకు సంబంధించిన ప్రతి పైసా ఈ ఖాతా నుంచే ఖర్చు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో జాయింట్ అకౌంట్ తెరవొద్దు. అభ్యర్థి ఒక్కరి పేరుతో మాత్రమే ఖాతా ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఆయా వర్గాలకు చెందిన వారై ఉండాలి. ఈ మేరకు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 4, 5 ప్రకారం జనరల్ క్యాటగిరీ నియోజకవర్గాల నుంచి కూడా పోటీ చేయొచ్చు.
- అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి.
- నామినేషన్ సమయంలో నోటరీ చేసిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి ఆస్తులు, అప్పులు, కేసులు వంటి అన్ని వివరాలూ ఉండాలి.
- నామినేషన్ సమయంలో రిటర్నింగ్ అధికారి అడిగే ఏ ధ్రువపత్రాన్నైనా సమర్పించలేని పక్షంలో వాటిని అందించేందుకు తుది గడువు వరకు సమయం ఉంటుంది.
- నామినేషన్లు వేసేటప్పుడు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధి లోపు ఊరేగింపులకు అనుమతి ఉండదు. ఆ 100 మీటర్ల దూరంలోకి 3 వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
- రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అభ్యర్థి సహా ఐదుగురు మాత్రమే వెళ్లడానికి అనుమతి ఉంటుంది.
- నామినేషన్ పరిశీలించేటప్పుడు అభ్యర్థి, ఎలక్షన్ ఏజెంట్, అభ్యర్థిని ప్రతిపాదించిన వ్యక్తుల్లో ఒకరు, మరొక వ్యక్తి ఎవరైనా వెళ్లొచ్చు. న్యాయవాదిని కూడా తీసుకెళ్లవచ్చు.
- అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించే, అర్హత నిర్ణయించే అధికారం రిటర్నింగ్ అధికారికి మాత్రమే ఉంటుంది.

> అభ్యర్థి తన ఎన్నికల ఖర్చును అధికారులకు పారదర్శకంగా అందజేయాలి. ఆర్థిక లావాదేవీలతో సంబంధం లేకుండా నామినేషన్ వేయడానికి కనీసం 24 గంటల ముందు ప్రారంభించిన నూతన బ్యాంకు ఖాతా నంబర్‌ను అందజేయాలి. బ్యాంకు పేరు, బ్రాంచి చిరునామా తదితర వివరాలు స్పష్టంగా తెలియజేయాలి.

# ప్రజల మూడ్ పసిగట్టే టెక్నాలజీ!

- ఏఐ ఆధారిత టెక్నాలజీ ద్వారా జనాల ముఖ కవళికల అంచనా
- బహిరంగ సభలు, ర్యాలీల్లో జనాల మూడ్‌ను గుర్తిస్తుంది
- కొత్త సాంకేతికతను అభివృద్ధి చేస్తున్న ఐఐటీ హైదరాబాద్, ముంబై ఏఐ నిపుణులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఎన్నికల వేళ ప్రజల మూడ్‌ను పసిగట్టే కొత్త టెక్నాలజీపై ఏఐ నిపుణులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికలు వచ్చాయంటే ర్యాలీలు, సభలు, యాత్రలతో సందడి వాతావరణం నెలకొంటుంది. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల కంటే ప్రచారంలో పాల్గొనే సాధారణ ప్రజల హవా ఎక్కువగా ఉంటుంది. ఇలా ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొనే జనాల మూడ్‌ను అంచనా వేసేందుకు ప్రత్యేక టెక్నాలజీని డెవలప్ చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే విధానం ద్వారా సమావేశాలు, మహాసభలు, ర్యాలీల్లో పాల్గొన్న జనాలు ఆ పార్టీ గురించి ఏమని ఆలోచిస్తున్నారనే విషయాన్ని తెలుసుకునేలా డిజైన్ చేస్తున్నారు. ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ ముంబై కంప్యూటర్ నిపుణులు చేపట్టిన ఈ ప్రాజెక్టు రానున్న రోజుల్లో ఎన్నికల ప్రక్రియల్లో కీలకంగా మారనుందని టెక్ నిపుణులు చెప్తున్నారు.

**జనాల మూడ్ పసిగట్టేలా**

ఎన్నికల సందర్భంగా జరిగే సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహన యాత్రల్లో పాల్గొనే జనాల మూడ్‌ను పసిగట్టేందుకు ఈ టెక్నాలజీని డెవలప్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచంలోని పలు దేశాల్లో ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ ఎనాలసిస్ టెక్నాలజీని నిపుణులు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా ముఖ కవళికలను బట్టి వారి మానసికస్థితి, ఆరోగ్య పరిస్థితి, ఆలోచన పరిపక్వత, శారీరక రుగ్మతలను అంచనా వేస్తున్నారు. అలాంటి సమాచారానికి అదనంగా మరికొన్ని అంశాలను జతచేసి జనాల మూడ్, ఆలోచన ధోరణిని టెక్నాలజీ ద్వారా విశ్లేషించేలా ఏఐని రూపకల్పన చేస్తున్నారు. ఒకసారి సభలు, సమావేశాలకు హాజరైన వారి వీడియోలు, ఫొటోలను ఏఈ టెక్నాలజీతో కూడిన ఎనాలసిస్ వ్యవస్థకు అనుసంధానం చేయగానే వాటిని విశ్లేషించి సంబంధిత సమావేశంపై కలిగిన అభిప్రాయాన్ని హావాభావాలతో గుర్తించేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఈ తరహా టెక్నాలజీ ప్రయోగదశలో ఉండగా.. త్వరలోనే అందుబాటులోకి వస్తుందని, జనాల మూడ్‌ను ఖచ్చితంగా అంచనా వేసేందుకు వీలు కలుగుతుందని ఐఐటీ హైదరాబాద్ టెక్ నిపుణులు భావిస్తున్నారు.

# ఉద్యమాన్ని ఆపేది లేదు: మరాఠా

- మరాఠా కోటాపై అట్టుడుకుతున్న మహారాష్ట్ర
- మంత్రి హసన్ ముష్రిఫ్ వాహనం ధ్వంసం
- సచివాలయానికి గేటు వేసేందుకు ఎమ్మెల్యేల యత్నం



రిజర్వేషన్లు కల్పించాలంటూ సోలాపూర్‌లో టైర్లు తగలబెట్టిన నిరసనకారులు

ముంబయి, నవంబర్ 1: విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలంటూ ఉద్యమ బాట పట్టిన మరాఠీలు మహారాష్ట్రలోని బీజేపీ–శివసేన సంకీర్ణ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు. కుంబీ సర్టిఫికెట్లు ఇస్తామని, మరాఠ్వాడా ప్రాంతంలో రిజర్వేషన్లు అమలుజేస్తామంటూ ప్రభుత్వం మంగళవారం చేసిన ప్రకటన ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేకపోయింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం ఆందోళనలు కొనసాగాయి. ఐదు జిల్లాల్లో బస్ సర్వీసుల్ని, బీడ్ జిల్లాలో ఇంటర్నెట్ సేవల్ని ప్రభుత్వం నిలిపివేసింది. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే, రిజర్వేషన్లపై నిరసనలు కొనసాగిస్తామని ప్రకటించారు. బుధవారం దక్షిణ ముంబయిలో మంత్రి హసన్ ముష్రిఫ్ వాహనాన్ని ఆందోళనకారులు ధ్వంసం చేశారు. మహారాష్ట్ర సచివాలయం 'మంత్రాలయం' వద్ద వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు చేపట్టిన నిరసన ఉద్రిక్తంగా మారింది. గేటుకు అడ్డంగా కూర్చొని ఎవ్వరినీ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు సచివాలయం గేటుకు తాళం వేసేందుకు ప్రయత్నించారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రిజర్వేషన్లపై చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు రిజర్వేషన్ల ఉద్యమం తీవ్ర రూపం దాల్చుటంతో సీఎం ఏక్‌నాథ్ షిండే బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. మనోజ్ జరాంగే తన ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని కోరుతూ సమావేశం తీర్మానం చేసింది. అయితే, దీక్షను విరమించడానికి జరాంగె నిరాకరించారు. బుధవారం సాయంత్రం నుంచి మంచినీళ్లు కూడా తీసుకోవటం ఆపేస్తున్నట్టు ప్రకటించారు.

## డేటింగ్ ప్లాట్‌ఫామ్‌గా 'ఎక్స్'

న్యూఢిల్లీ, నవంబర్ 1: ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌ను డేటింగ్ ప్లాట్‌ఫామ్‌గా తీర్చిదిద్దనున్నట్టు ఆ సంస్థ యజమాని, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఉద్యోగ నియామకాల వేదికగానూ ఎక్స్‌ను మార్చనున్నట్టు చెప్పారు. ఎక్స్ సీఈవో లిండా యకారినో, సంస్థ ఉద్యోగులతో తాజాగా నిర్వహించిన సమావేశంలో లింక్డ్ఇన్, యూట్యూబ్, ఫేస్‌టైమ్ వంటి యాప్‌లతో సహా డేటింగ్ యాప్‌లతో ఎక్స్ ఎలా పోటీ పడాలనుకొంటున్నదో మస్క్ వివరించారు. ఎక్స్‌పై తనకున్న విజన్, దాన్ని 'ఎవ్రీతింగ్' యాప్‌గా ఎలా మార్చాలనే దానిపై చర్చించారు.

## వాయు కాలుష్యంతో పిల్లల్లో రక్తహీనత

న్యూఢిల్లీ, నవంబర్ 1: వాయు కాలుష్యంతో పిల్లల్లో రక్తహీనత, తీవ్రమైన శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు తలెత్తే ప్రమాదముందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. తక్కువ బరువుతో శిశు జననాలకు ఇది కారణమవుతున్నదని ఐఐటీ ఢిల్లీ, ఎనర్జీ–రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకుల బృందం తేల్చింది. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–4 డాటాను విశ్లేషించిన పరిశోధకులు పై విషయాన్ని వెల్లడించారు.

## • రోడ్డుపై భారీ మొసలి ప్రత్యక్షం

వనపర్తి జిల్లా అమరచింత పట్టణ సమీపంలోని మరికల్ ప్రధాన రహదారిపై మంగళవారం అర్ధరాత్రి భారీ మొసలి ప్రత్యక్షమైంది. పది అడుగుల పొడవు.. మూడు క్వింటాళ్ల బరువు ఉన్న మొసలి పెద్ద చెరువు నుంచి రోడ్డుపైకి వచ్చింది. ఇదే సమయంలో పామిరెడ్డిపల్లికి చెందిన వాల్మీకి రాజు, వెంకటేశ్ బైక్‌పై వెళ్తుండగా.. మొసలిని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డీఎఫ్‌వో ఆదేశాల మేరకు స్నేక్ సొసైటీ సభ్యులు కృష్ణసాగర్, గోపాల్, నరేందర్ అక్కడకు చేరుకొని మొసలిని తాళ్లతో బంధించి ప్రత్యేక వాహనంలో తరలించి.. జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో వదిలిపెట్టారని ఎస్సై జగన్ తెలిపారు.

–అమరచింత




